21

# కంచె మేసిన చేను

వాన వెలిసింది. కానీ, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలి తగ్గలేదు. ప్రకృతి బీభత్సంగా ఉంది. అంతే గదిలో మంచంమీద కూచున్న శాంత. చెదిరిపోయిన జుట్టు, నలిగిపోయిన, చిరిగిన బట్టలు, ఎర్రగా వాచిన కళ్ళు.

చలనంలేని బొమ్మలాగా కూచుండిపోయింది శాంత.

పది దాటాక శంకర్రావు వచ్చాడు. వస్తూనే కలయచూస్తూ, విగ్రహంలా కూచున్న శాంత ముందు నుంచున్నాడు.

అతనికేసి ఒక్కసారి చూసి, బావురుమంటూ అతని చేతిలో మొహం ఉంచింది.

పరిస్థితి అర్థం అయినట్లుగా చూసి, "ఎవరూ?" అన్నాడు.

"సంతోష్!" అంది వెక్కిళ్ళ మధ్య.

పావుగంట గడిచాక, లేచి, మంచినీళ్ళు తాగి జుట్టుని గోళ్ళతో దువ్వి, వేలు ముడివేసింది.

"శంకర్! పోలీసు రిపోర్టిద్దాం. నడు" అంది.

నిదానంగా చూశాడు. "గుమ్మడికాయ, కత్తిని ఢీకొంటే అది హీరోయిజం అవుతుందా? ఆత్మహత్య అవుతుంది. ఆవేశం, కోపం, అవమానంలో మునిగి ఉన్న

నువ్వు పోలీస్ రిపోర్ట్ ఇస్తాననడంలో ఆశ్చర్యం లేదు. ఇప్పుడు జరిగినది ఓ ఎత్తు, రిపోర్ట్ ఇచ్చాక జరగబోయేది ఓ ఎత్తు."

తీక్షణంగా చూసింది శంకర్ వైపు.

"ఓ స్త్రీకి అన్యాయం జరిగింది. ఆ అన్యాయాన్ని పోలీసుల వరకూ తీసుకెళ్ళక పోవడం మహానేరం. నాకేం చెప్పకు. చదువుకున్నదాన్ని. చదువు విజ్ఞానం కోసమే కాదు, అవసరం అయినప్పుడు చేతల్లో చూపించినప్పుడే బాధ్యతాయుతమైన సిటిజెన్‌గా ప్రవర్తించగలను. నన్ను పిరికిదాన్ని చేయకు... ఆ పోలీసులకి నిజం నిర్భయంగా చెప్పి, సంతోష్‌ని కటకటాల వెనక్కి తోయించాలి. ఈ క్షణంలో మన చుట్టుపక్కల వాళ్ళు సాక్షులు..."

నిర్వికారంగా ఆమెకేసి చూశాడు.

"హుఁ... సాక్షులు.. సాక్ష్యం... మన ఊరి పోలీసుల సంగతి అందరికీ తెలిసిందే. సాక్షులంటున్నావ్. వీళ్ళంతా నీకు అండగా ఉండి సాక్ష్యం చెప్తారన్న నమ్మకం నీకుందేమో కానీ, నాకు లేదు.

బలం ఉన్నవాడికే రోజులు, డబ్బు మాట్లాడే రోజులు, మోసపోయిన వాళ్ళనే నేరస్థులుగా చూసే రోజులు. నీ ప్రతీకారం కుక్కని కరవడం లాంటిది. అది తిరిగి నిన్ను కరుస్తుందన్న సంగతి మర్చిపోకు శాంతా!"

ఆశ్చర్యంగా చూసింది శంకర్‌ని.

"సమర్థిస్తున్నావా! ఆ సంతోష్ ఏం చేసాడో తెలిసీ కూడా..." తడబడ్డాడు.

"పొరబాటు శాంతా! నేను ఆ సంతోష్‌ని ఏమీ సమర్థించడంలేదు. గోడకి ఢీ కొడితే తలకి బొప్ప కడ్తుందని నీకు తెలీడం లేదు అని చెప్తున్నాను. లాభం లేని పోరాటంలో మనసు అలసిపోవడం తప్ప మరోటి ఉండదు."

"ఇంక లాభనష్టాలేఁవిటీ? న్యాయం కోసం పోరాటం. నేరాలు చీకట్లోనే జరుగుతాయనడానికి మరో నిదర్శనం... దోచుకునేవాడికి అనుకూలించే అజ్ఞానంతో నువ్వు మాట్లాడకు. ఆలస్యం అయిపోతూంటే కేసులు అందులో ఇలాంటివి వీక్ అయిపోతాయి. నా సహనం సంతోష్‌కి శక్తినే ఇస్తుంది."

శంకర్ కదల్లేదు.

ఒక్కసారిగా లేచి, శంకర్ మొహం ముందుంచింది చేతిని.

"ఇదా ఓ భర్తగా నాకు నీ నుంచి లభించే రక్షణ! ఇదా నీ ప్రేమ! స్కూల్లో ఉన్నప్పట్నించే ప్రేమించానన్నావ్! పెళ్ళికాకుండానే గర్భవతిని చేశావు. మాయ మాటలు చెప్పి అబార్షన్ చేయించావు..." తల విదిలించాడు.

"మరి నువ్వు, నన్ను ప్రేమించలేదా! ప్రేమించానని మోసం చేశావా?" కళ్ళు పెద్దవిగా చేసి అన్నాడు.

"ప్రేమ... హుఁ... పదహారేళ్ళ వయసులో ప్రేమించాను. కాబట్టే నీ మాటలకి లొంగిపోయాను. ప్రేమంటే సరి అయిన అర్థం తెలీలేదు కాబట్టే గర్భం తాల్చాను. చేసింది తప్పు అని తెలిసింది కాబట్టే అబార్షన్ చేయించుకున్నాను. అవమానాలు అపహాస్యాలు భరించలేక ధైర్యంగా మహిళా సంఘాలని ఆశ్రయించి, ఈ సంఘంలో నాకు ఓ స్థానం కల్పించుకోవాలని, నిన్ను పెళ్ళిచేసుకున్నాను. నాకన్నా అన్నివిధాల తక్కువ అయినా నిన్ను భర్తగా అంగీకరించాను. ఇవన్నీ కూడా నా ప్రేమలోనివే... కానీ.. పొరపాటు జరిగిపోయింది... చెప్పనా!

నేను చేసిన పొరపాటు, నీ వ్యసనాలని చూడడం మర్చిపోవడం. చూసీ చూడనట్లు వదిలిపెట్టేశాను. అసలు వ్యసనాలు ఉన్న మనిషిని ప్రేమించకూడదని పదిహేను పదహారేళ్ళ వయస్సులో ఏం తెలుస్తోంది? రానురాను, నువ్వు చెడ్డ భర్తవి అని తెలుసుకున్నావు. కానీ, మామూలు ఆడదాన్నయిపోయాను... జీవితం ఆనందంగా, సుఖంగా ఉండాలంటే కన్నీళ్ళు కార్చకూడదు అని అనిపించి, రాజీలతో సర్దుబాట్లతో గడుపుతున్నాను..."

శంకర్ మొహంలో అవమానంతో ఎర్రగా అయింది.

"ఇంక చాలు నడు... రిపోర్టిద్దాం అంటే వద్దని ఎందుకంటాను?... నడు.." అంటూ స్కూటర్‌మీద ఆరు మైళ్ళ దూరంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళారు.

కునికిపాట్లు పడుతున్న ఇన్‌స్పెక్టర్ బద్ధకంగా కళ్ళు తెరిచి చూశాడు. చెదరిన జుట్టుతో, నల్లమబ్బుల చాటున ఉన్న చందమామలాంటి మొహం ఎర్రగా వాచిన కళ్ళు... ఒక్కసారి మత్తు వదిలింది.

కొంచెం అర్థం అయినట్లుగా మొహం పెట్టి తల ఊపాడు.

మెల్లగా పెన్ను చేతిలోకి తీసుకుంటూ వాళ్ళ వైపు చూశాడు.

"ఏందీ?"

శాంత భుజం తట్టాడు శంకర్.

"నన్ను... నన్ను... రాత్రి..." వాక్యం పూర్తిచెయ్యలేకపోయింది. అంతవరకూ ఉన్న ఆవేశం, కోపం... ఒక్కసారిగా ఆమెను వదిలేశాయి. ఏదో కాంప్లెక్స్ శాంతని చుట్టేసింది.

"రిపోర్ట్ రాయాలి.... ఆఁ.. చెప్పు... పేరు..."

"శాంత..." మెల్లిగా అంది.

"ఆఁ... ఏమాయే... చెప్పు..."

విషయం ఎంత డెలికేటో ఇక్కడి కొచ్చేవరకూ తెలీలేదు.

"ఎవరో గుర్తుపడతావా?"

తలూపింది.

"ఎవరూ?"

"నేను పనిచేసే స్కూలు యజమాని సంతోష్‌బాబు..." అదిరిపడ్డట్టుగా కదిలాడు. తమాయించుకున్నాడు.

"రేప్ చేసింది సంతోష్ బాబని ఎట్లంటావ్? సాయంకాలం సంది కరెంట్ లేదాయే... నీ భర్త కూడా కావచ్చు..."

'ఛీ' అని అనుకుంది.

"సంతోష్ మీ ఇంటికెప్పుడొచ్చిండు?"

"ఆరు దాటింది. చీకట్లో, వర్షంలో మా ఇంటికొచ్చాడు."

"నీ ఇంటికి సంతోష్ వస్తుంటే ఎవులన్నా జూసిన్రా?"

"అందరూ, మా ఇంటి కాంపౌండులోని వాళ్ళంతా చూశారు."

"మంచిది. మరి సంతోష్ ఎందుకొచ్చే?"

"ఏడో క్లాసు పిల్లలకి పరీక్షల్లో అన్ని ఆన్సర్లు బోర్డు మీద రాయమని అన్నాడు. ఆ తప్పుపని నేను చేయనన్నాను..."

పెన్ను కింద పెట్టి ఆమె మొహంలోకి చూశాడు.

"నువ్వు ఆల్ల ఇస్కూల్ల పనిచేస్తవా?"

తలూపింది.

"ఆ నీతులకే రేప్ సేసిండా?"

సిగ్గుగా అనిపించింది శాంతకి.

"మూడేళ్ళ నుంచి, ఇక్కడే పనిచేస్తున్నాను. నా మీద మరి అతనికి ఏ అభిప్రాయం ఉందో నాకు తెలీదు. నేనెప్పుడు అతనితో మాట్లాడలేదు. రోజూ పొద్దున్న వస్తాడు. ఓ రెండుగంటలు స్కూలు పని చేసుకుని వెళ్ళిపోతుంటాడు. ఈ ఏడాదే బి.ఏ. పాసయ్యాను. ఏడో క్లాసుకి వెళ్ళడం కూడా ఇదే మొదటిది..."

"నీ భర్త ఈననేనా?" పెన్నుతో చూపించాడు.

అవునన్నట్లుగా తలూపింది.

"ఎక్కడ పనిచేస్తాడు? ఇక్కడ్నేనా?"

"అన్నారంలో... రైస్ మిల్స్‌లో..."

గుర్తొచ్చినట్లుగా రాయడం ఆపి తలెత్తాడు.

"లక్ష్మీ రైస్ మిల్స్‌లోనా! అది సంతోష్ వాళ్ళదే కదా!"

శాంత పిడుగు పడ్డట్లుగా చూసింది శంకర్‌వైపు.

"నాకు తెలీదు, అది సంతోష్ వాళ్ళదని, నిజంగా..."

"ఏమయినా కానీ, డాక్టరమ్మ సూడాల ఇట్లాంటియన్ని. పరీచ్చ చేయాల, రిపోర్ట్ రావాల... ఏడుగంటలకి రేప్ సంతోష్ చేసిండని ఆమె చెప్పాల... ఆమె సూర్యాపేటలో ఉంటది. పొద్దుగాల రా... పో..."

ఒక్కసారి నీరసం వచ్చేసింది. నిస్సత్తువగా ఇంటికి వచ్చి గోడకి చేరబడి మోకాళ్ళమీద తల ఆన్చింది. కొవ్వొత్తి వెలిగించాడు శంకర్. ఆమెను చూస్తూ ఆమె దగ్గరికొచ్చాడు. ఆ గుడ్డి వెలుగులో, వడలిపోయిన మల్లెపువ్వులా ఉంది శాంత.

'ఈ స్త్రీ శక్తిని ఎలాగైనా స్వాధీనం చేసుకున్నాను. పాపం లేత కొమ్మని పట్టుకొని ఊగుతోంది' మనసులో అనుకున్నాడు.

'నీ అప్పటి అహంకారం ఏదీ?' శంకర్ పెదవులు విచ్చుకున్నాయి. సన్నటి నవ్వు.

శాంత అన్న మాటలు గుర్తొచ్చాయి.

"నువ్వు చాలా చెడ్డవాడివని తెలుసు. అయినా మంచి భర్తగా మారుతావన్న నమ్మకంతో నన్ను నేను ఆత్మవంచన చేసుకుంటున్నానని అనిపిస్తోంది.

"మంచి భర్తను ఎలా అవుతాను? నువ్వు నామీద చేయి చేసుకున్నావు. పోలీసు రిపోర్టిస్తావన్నావు." బెదిరించావు కదా! ఇప్పుడేం చేయగలవు? ఇప్పుడెలా బెదిరించగలవు?

"నా ఇంటి ముందు డేరా వేసి, మహిళా సంఘాల అండ చూసుకొని నిన్ను పెళ్ళిచేసుకునేట్లుగా వొప్పించావు. నీ జీవితం ఛిన్నాభిన్నం చేయనా!" ఆ నవ్వుని అనువాదం చేస్తే ఇదే అర్థంతో, ఇలాగే ఉంటాయి.

కానీ, శాంత ఆడదే.. ఈ దౌర్భాగ్య క్షణంలో అబల, అందుకే మేకపిల్లలా వాలిపోతోంది, కసాయి వాడిని మళ్ళీ నమ్ముతోంది.

"శాంతా! ఎలా ఉన్నావో? లేచి స్నానం చెయ్యి... అలా జారిపోకు. నా మాట విను... కొంచెం తేలికవుతుంది... లే..." అంటూ నెమ్మదిగా బాత్రూంలోకి తోశాడు. కరెంట్ వచ్చింది.

ఆవకాయ అన్నం కలిపి, ఆమె నోట్లో పెట్టాడు. మనిషి కరిగింది. పెరుగు అన్నం కూడా పెట్టాక మూతి తుడిచి, మంచినీళ్ళిచ్చాడు. మనసు కరిగింది.

బయట మెరుపులు, ఉరుములు తగ్గినా ఈదురుగాలులు తగ్గలేదు. కిటికీలోంచి తేమగాలి రివ్వున వీస్తోంది. కరెంట్ మళ్ళీ పోయింది. చీకటి.

శాంత తలని తన ఒళ్ళో పెట్టుకుని, ఆమె జుట్టు, చెంపలు సవరిస్తూ ఉండిపోయాడు.

ఆ తర్వాత ఆమె పక్కన పడుకుని, ఆమె వీపు, భుజాలు నిమురుతూ, మెల్ల మెల్లగా ఆమెను ఆక్రమించుకున్నాడు.

ఓ పావుగంట తర్వాత... ఇద్దరూ బట్టలు సరిచేసుకున్నారు. శంకర్ కిటికీ దగ్గర నుంచుని సిగరెట్ వెలిగించుకుని, కిటికీలోంచి చీకట్లోకి చూస్తూండిపోయాడు.

"నువ్వు చెడ్డవాడివని తెలుసు. అయినా ఎప్పటికైనా మంచి భర్తగా అవుతావన్న నమ్మకంతో నన్ను నేను ఆత్మవంచన చేసుకుంటున్నాను..." పెదవుల మీద నవ్వు. శాంత ఆ చీకట్లో చూడలేదు కానీ, ఒక వేళ చూసినా, ఆ నవ్వులోని క్రూరత్వాన్ని కనిపెట్టగలిగేది కాదేమో...

వెనక్కి తిరిగి చూశాడు శాంత వైపు.

వెల్లకిలా పడుకుని పై కప్పుకేసి చూస్తోంది. ఆలోచిస్తోంది.

ఏం జీవితం! పదహారేళ్ళ వయస్సులోని ప్రేమ ఏం ఇచ్చింది? అపహాస్యాలు, అనుమానాలు, అపశ్రుతులు. ఇంట్లోవాళ్ళ దృష్టిలో జుగుప్సాకరమైన పెళ్ళి. చుట్టూ అందరూ ఉన్నారు. కానీ, ఎవరూ పలకరు. నేల మీద నలిగిపోయిన హృదయ సౌకుమార్యం, మలినం అయిపోయిన జీవితం, అందులోంచి మౌనం ఆ వెంటనే దీనత్వం. గాయపడ్డ మనసులోంచే నెత్తురు మళ్ళీ మళ్ళీ...

కన్నీళ్ళు పక్కనుంచి కారిపోతున్నా తుడుచుకోడానికి ప్రయత్నించలేదు.

మర్నాడు పొద్దున్నే శాంత, శంకర్ ఆస్పత్రికెళ్ళారు.

డాక్టరు ఆ రోజున తొందరగానే వచ్చింది.

శాంత లోపలికెళ్ళింది. ఆ డాక్టరు, కళ్ళజోడులోంచి శాంతని పరీక్షగా చూసింది. శాంతలో ఓ లాంటి కాంప్లెక్స్ బయల్దేరింది. ఓ డాక్టర్ కుండాల్సిన కరుణ, దయ, ఆర్ద్రత ఆ కళ్ళల్లో ఆమెకు ఏమీ కనపళ్ళేదు. ఆ నోరు వంపు అదీ చూస్తే ఏవిటో కఠినంగా కనిపించింది.

"పడుకోండి." కదిలింది శాంత.

లాబ్ టెక్నీషియన్ రెండుసార్లు అటూ ఇటూ తిరిగాడు.

రిపోర్ట్ వచ్చింది.

"రిపోర్ట్ ప్రకారం ఆమెను అనుభవించింది, ఓ ఐదారు గంటల క్రితం... అంటే... ఈ తెల్లారు ఝామునన్నమాట...

"అంటే..." భూమిలోకి కూరుకుపోతోంది శాంత.

"అంటే... ఆమె రిపోర్టిచ్చినట్లుగా ముందురోజు సాయంత్రం ఏడు గంటలకి కాదు. కాబట్టి, సంతోష్... కాదు..."

శాంత ఒక్కసారి చూసింది శంకర్ వైపు. శంకర్ తల తిప్పుకున్నాడు.

అర్థం చేసుకుంటే, ఆ చూపులో వెయ్యి అర్థాలు. ఎన్నో ఛీత్కారాలు.

అన్యాయం జరిగింది. కానీ ఎలా జరిగిందో శాంత ఇంటి పక్కవాళ్ళకి అర్థం కాలేదు. ఏం జరిగింది? డాక్టరు డబ్బు తీసుకుందా? లాబ్ టెక్నీషియన్‌ని కొన్నారా? శాంతని బెదిరించారా? రాజకీయం చేశారా? లేకపోతే రిపోర్ట్ తప్పా?

ఏడు గంటలకి సంతోష్ చేసినది రేప్. తెల్లారుఝామున శంకర్ చేసినది రేప్ కాదు. సమయం సందర్భం తెలివిగా క్యాష్ చేసుకున్న భర్త హోదాలోని శంకర్‌కి లొంగిపోయింది. సంతోష్‌ని రక్షించడానికే శంకర్ వేశాడేమో ఈ పథకం...

ఇంటికొచ్చాక, చాలాసేపు గోడకి జారగిలపడి ఆలోచనలో ఉండిపోయింది. శంకర్ ఇంటికి రాలేదు. ఎక్కడికి వెళ్ళి ఉంటాడో ఊహించింది.

అన్నం తినలేదు. నీళ్ళు తాగలేదు. చీకటి పడింది. 'ప్రకృతిపరంగా బలహీనురాల్ని. అందుకే వాళ్ళిద్దరూ పశువులయ్యారు. కానీ, మానసికంగా బలవంతురాల్నే. గుమ్మడి కాయని కత్తితో కాదు, గొడ్డలితో నరకగలను' అన్న ధైర్యం వచ్చేవరకూ అలాగే కూచుంది.

ఇక్కడ ఉండడం అంత నీచం మరోటి లేదు. ఒక్కసారి లేచింది. మహిళా సంఘాలు గుర్తొచ్చాయి. ఉన్న చీరలు సర్దుకుంది, బయటికొచ్చింది. హైదరాబాద్‌కి వెళ్ళే బస్సులు ప్రతీ అరగంటకీ ఉన్నాయి.

నిన్న సరిగ్గా ఇదే టైముకి శంకర్, సంతోష్‌ని రక్షించడానికి తనని లోబర్చుకున్నాడు. ఈ రోజున అదే టైముకి నిర్ణయం తీసుకుని గడప దాటింది. టైము ఐదు. చీకటిగా ఉంది. అయినా, రాని సూర్యుడి వెలుగులు భూమిని చేరుకోడానికి మబ్బులతో పోట్లాడుతూ దోబూచులాడుతున్నాయి.

బాగా పొద్దెక్కాక శంకర్ ఇంటికొచ్చాడు.

శాంత లేదు, ఆమె తాలూకు వస్తువులు కూడా లేవు.

టీవీ మీద, రిమోట్ కింద ఆమె రాసిన ఉత్తరం కనపడింది.

"..............."

"స్త్రీలంతా ఆటబొమ్మలని అనేవాడివి. నేనొప్పుకోలేదు. పైగా వెర్రిగా వాదించాను. కానీ, ఈ రోజున నిజంగానే ఆటబొమ్మని చేశావు. నీ స్టేట్‌మెంట్‌కి బలం ఇచ్చుకున్నావు. సరదాగా ఆడుకున్నావు. ఆడుకొమ్మని నీ ఫ్రెండ్‌కి కూడా ఇచ్చావు. కానీ, నేను నా జీవితం అంతా అయిపోందని అనుకోలేదు... నా జీవితాన్ని నేను సరిదిద్దుకోగలను. నీలాగా ఓ నీచత్వం లోంచి మరో నీచత్వంలోకి కాదు... గ్రేస్‌గా.. నిన్ను ఎదిరించడానికి, దేవుడు నాకిచ్చిన శరీర బలం చాలకపోవచ్చు, నా ఆత్మబలం చాలు. నరాల్ని చీల్చేసిన అనుభవాలు నా జీవితాన్ని చెక్కుకునే ధైర్యం ఇస్తున్నాయి. అగ్నిలా కాల్చేసే సందేహాల్లో కాలిపోను, కొలిమిలోంచి పైకి వచ్చిన బంగారంలా నా జీవితాన్ని నేను మెరుగు పరుచుకోగలను. భవిష్యత్తు ఎలా ఉన్నా సరే, చీకట్లోంచి, గోతుల్లోంచి ప్రయాణించగలను. ఆ శక్తి నాలో ఉంది. నాలాంటి వాళ్ళకి అండగా నిలిచే చట్టాలున్నాయి. వాటినే నేను ఆశ్రయిస్తాను. జగన్నాథ రథ చక్రాల్లాంటి ఆ చట్టాల కింద నువ్వు నలిగిపోయేలాగా చేయగలను. ఆ నమ్మకం నాకుంది.

– శాంత"

'ఆఁ... ' అంటూ చప్పరించేసి ఆ ఉత్తరాన్ని చింపేశాడు. బనీనులో దాచుకున్న నోట్ల కట్టల్ని తీసి లెక్కపెట్టుకోడంలో మునిగిపోయాడు.

*భూమిక మాసపత్రిక, జూన్ 2008*